క్లుప్తంగా

ఘనంగా నాగపంచమి పూజలు

పామర్రు: శ్రావణ మాసం శుద్ధ పంచమిని పురస్కరించుకుని నాగ పంచమిగా సోమవారం భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ఉన్న నాగేంద్రస్వామి పుట్టల వద్ద, నాగేంద్రస్వామి ఆలయాల్లో విశేషంగా పూజలు చేశారు. స్థానిక విజయవాడ రోడ్డులోని బుచ్చమ్మతల్లి ఆశ్రమంలో ఉన్న నాగేంద్రస్వామి విగ్రహానికి ఆవుపాలతో విశేషంగా అభిషేకాలు చేశారు. అనంతరం స్వామికి శత సహస్ర నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమేశ్వరస్వామి ఆలయం వల్మీకేశ్వరీ ఆలయం, రాపర్లలోని గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో నాగేంద్రస్వామికి నాగపంచమి సందర్భంగా ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



మండవల్లి: మండలంలోని లింగాలలో ఎరువులు, పురుగు మందుల దుకాణాలను మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నమూనాలను స్వీకరించి పరీక్షల నిమిత్తం పంపారు. ఈ సందర్భంగా డీలర్లకు పలు ఆదేశాలు ఇచ్చారు. ఎరువులు, పురుగుమందుల విషయంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఎరువుల వివరాలు, నిల్వ, ధరల వివరాలను స్టాక్‌బోర్డులో ప్రదర్శించాలని తెలిపారు. లైసెన్స్‌లు గడువులోపే రెన్యువల్ చేయించాలని సూచించారు. ఎంఆర్‌పీకే అమ్మాలని పేర్కొన్నారు. నిబంధనలకు అనుగుణంగా ఎరువులు, పురుగుమందులు నిల్వచేయాలన్నారు. ఎరువులను ఈ–పాస్ ద్వారానే అమ్మకాలు చేయాలన్నారు. కాలపరిమితి ముగిసిన వాటిని విక్రయించరాదన్నారు. వ్యవసాయ శాఖ అనుమతించిన ఎరువులు, పురుగుమందులు మాత్రమే విక్రయించాలని తెలిపారు. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాఠశాలకు కుర్చీల బహూకరణ



తోట్లవల్లూరు: ప్రభుత్వం, దాతలు అందిస్తున్న సహకారం వినియోగించుకుని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి సూచించారు. మండలంలోని దేవరపల్లి ప్రాథమిక పాఠశాల (స్పెషల్)కు పీస్ సేవా సంస్థ ఆధ్వర్యంలో కుర్చీలు, విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. రామ్మోహన్‌రెడ్డి ద్వారా పీస్ సంస్థ చైర్మన్ గుడివాడ నిరంజని పాఠశాలకు ఆరు కుర్చీలు, 53 మంది విద్యార్థులకు పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. సర్పంచ్ మరీదు వెంకటేశ్వరరావు, పీస్ సేవా సంస్థ అధ్యక్షుడు జి. ప్రశాంత్, ఉపాధ్యాయులు మధుసూదనరావు, చంద్రకళ, హారిక తదితరులు పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

మొవ్వ: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ సోమవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమతమ నివేదికలతో తప్పని సరిగా హాజరు కావాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ముదినేపల్లి రూరల్: మండలంలోని బొమ్మినంపాడు కొత్త దళితవాడ కమ్యూనిటీ హాలు వద్ద ప్రకృతి వ్యవసాయంపై రైతులకు సిబ్బంది సోమవారం అవగాహన కల్పించారు. డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ నారాయణ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయానికి సంబంధించిన కషాయాలు, వేపపిండి, లింగాకర్షక బుట్టలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు అనూష, సుధాకర్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



మండవల్లి: బీసీ కాలనీలో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మృతి చెందగా, అతని సతీమణి టి.రాజేశ్వరికి మట్టి ఖర్చుల నిమిత్తం సర్పంచ్ మెండా ఝాన్సీ సోమవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్, వార్డు సభ్యులు ఆగొల్లు సత్యనారాయణ, బోయిన వెంకటేశ్వరరావు, గ్రామ సంక్షేమ, విద్యా సహాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పాలన

- పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- కృష్ణాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం



కృష్ణాపురంలో బ్రోచర్ అందజేసి సమస్యలు తెలుసుకొంటున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు.
కృష్ణాపురం–కూచిపూడి ఆర్‌అండ్‌బీ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకొంటున్నామన్నారు. మండలంలో కృష్ణాపురంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. తొలుత గ్రామంలోకి వచ్చిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఆనందరామేశ్వరస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేసి, సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లుగా అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కూచిపూడి రోడ్డును అభివృద్ధి చేయాలని, అత్యధిక శివారు గ్రామాలున్న కృష్ణాపురం అభివృద్ధికి సహకరించాలని సర్పంచ్ వీరంకి బలుసలమ్మ ఎమ్మెల్యేను కోరారు. రహదారిని అభివృద్ధి చేస్తానని, గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని చెప్పారు. డ్రెయినేజీ సమస్య లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పరిపాలన సాగిస్తున్నట్లు వివరించారు. పరిశా జగన్, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, ఎంపీటీసీలు మర్రి దుర్గారావు, గుర్విందపల్లి వంశీ, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు వీరంకి చిరంజీవి, యార్లగడ్డ శివ, కల్యాణ్, శ్యామ్, కార్యదర్శి విద్యాధర్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన విజయవంతం

గుడివాడ ఆర్డీఓ పద్మావతి



మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడ టౌన్: గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఓటర్ల జాబితా పరిశీలన విజయవంతంగా పూర్తిచేశామని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. 72వ అసెంబ్లీ నియోజకవర్గం సంబంధించి ఓటర్ల జాబితా సవరణ, పరిశీలన, మృతుల ఓట్లు తొలగింపు, డోర్ నంబర్ల సవరణ వంటి అన్నింటినీ పూర్తి చేసి ఆన్‌లైన్ కూడా చేశామని వివరించారు. నూరు శాతం విజయవంతంగా ఈ కార్యక్రమం పూర్తికావడానికి సహకరించిన మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఎలక్షన్ డీటీ లోవరాజు, ఇంటింటికీ తిరిగి పూర్తి సమాచారాన్ని సేకరించిన బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్ఓలు) అందరిని ఆమె అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: స్థానిక పామర్రు రోడ్‌లో ఫ్లైఓవర్ నిర్మాణం కారణంగా కరెంట్ స్తంభాలు తొలగిస్తున్నందున మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఈఈ టి.రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా భీమవరం గేటు నుంచి పెదకాల్వ సెంటర్ వరకు, చౌదరిపేట, లక్ష్మీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ



బోనస్ పంపిణీ చేస్తున్న మేనేజర్ గోపిచంద్, సంఘ అధ్యక్షుడు కృష్ణారెడ్డి

పామర్రు: స్థానిక గంగానమ్మగుడి వద్ద ఉన్న పాల సేకరణ కేంద్రంలోని సభ్యులకు సోమవారం అదనపు బోనస్ పంపిణీ చేశారు. సంఘంలో పాలు పోసిన 270 మంది సభ్యులకు రూ.3.99,434 అదనపు బోనస్ అందజేశారు. 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి జూలై 31వ తేదీ వరకు పాలుపోసిన వారికి ఈ బోనస్ అందజేశారు. మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ అందిస్తున్న ఈ అదనపు బోనస్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నులిపురుగుల నివారణకు రైతులకు ఉచితంగా డీవార్మింగ్ బిళ్లలను అందించామని తెలిపారు. తాళ్ల అంజిరెడ్డి అధికంగా పాలుపోసి మొదటి స్థానంలో ఉండగా బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి ద్వితీయ స్థానంలో నిలిచారు. పాలసేకరణకేంద్ర అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘ వేతన కార్యదర్శి ఆరేపల్లి శ్రీహరి, సంఘ సభ్యులు దేవిరెడ్డి భాస్కరరెడ్డి, బి. మధుసూదనరెడ్డి, మావులూరి శేషురెడ్డి, కొల్లి ప్రసాదరెడ్డి, పామర్తి శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



పామర్రు: వృద్ధాప్యంలో ఉన్న ప్రతి ఒక్కరినీ సహృదయంతో ఆదుకుని సహాయం చేయాలని ఐఆర్‌ఎస్ సంస్థల అధినేత బిషప్ రెబ్బా ఇమాన్యుయేలు పేర్కొన్నారు. స్థానిక పామర్రు నల్లగుంట రహదారిలో ఎబినేజర్ పరిచర్య సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన శాంతి నికేతన్ భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వృద్ధులకు ప్రతి నెలా ఉచితంగా వైద్య పరీక్షలు, అందజేస్తున్నామన్నారు. చిన్నారులకు శాంతి నికేతన్‌లో ఉచిత విద్య, వారానికి ఒక్క రోజు వృద్ధులకు అన్నదానం చేస్తున్నామన్నారు. కృష్ణాజిల్లా కో ఆప్షన్ మెంబరు పరిశుద్ధ రాజు, ఎబినేజర్ పరిచర్య సంస్థ అధినేత స్పర్జన్‌రాజు, బిషప్ మదిరి జోసెఫ్, పలువురు క్రైస్తవ నాయకులు సామాజిక సేవకులు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద ఎక్కువైంది సారూ..



గుడివాడలో సమస్యను వివరిస్తున్న మహిళ



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసగౌడ్

స్పందనలో వినతి

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని తక్షణ పరిష్కారానికి స్పందన కార్యక్రమం ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. సోమవారం కౌన్సిల్ సమావేశం హాలులో నిర్మించిన స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి మూడు అర్జీలు వచ్చినట్లు ఆయన వివరించారు. పట్టణానికి చెందిన ఏవీఎస్ నారాయణమూర్తి తన ఇంటి సమీపంలో నిల్వ ఉన్న మురుగునీరు తొలగించాలని, బంటుమిల్లి రోడ్‌కు చెందిన షేక్ ఇస్మాయిల్ తమ ప్రాంతంలో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, ఇళ్ల సమీపంలో రోడ్లపై పశువులను కట్టేస్తున్నారని, దోమతోటి సుభాషిణి జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇప్పించమని, స్థానిక పెద్దవీధికి చెందిన బూరి సింహాచలం టిడ్కో గృహాల కేటాయింపులో పేరు మార్పునకు దరఖాస్తు చేశారు. ఆయా అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ మురళీకృష్ణ అన్నారు.

మండవల్లిలో..

మండవల్లి: మహిళా రిజర్వేషన్ ద్వారా ఎంపిక కాబడిన మహిళా సర్పంచ్‌ల నాయకత్వంలో పలుచోట్ల పురుషుల హవా కొనసాగుతుందని ఐక్య వేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్ఎస్ భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు పేర్కొన్నారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. సర్పంచ్‌లుగా ఎన్నిక కాబడిన మహిళల స్థానంలో వారి భర్తలు తదితర కుటుంబ సభ్యులు హవా కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు మహిళా సర్పంచ్‌లకు గౌరవం ఇచ్చి ప్రోత్సాహం అందజేయాలని కోరారు. ప్రధాన కార్యదర్శి మార్కురాజు, పి.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై స్పందనలో ఫిర్యాదు

పమిడిముక్కల: 1993లో కర్ణాటక రాష్ట్రం, హోస్‌పేట మున్సిపాలిటీలో పామర్తి లక్ష్మీపతి మరణించారు. అయితే పమిడిముక్కల మండలం, వీరంకి గ్రామంలో మరణించినట్లు 2016వ సంవత్సరంలో నమోదు చేయించిన అప్పటి తహసీల్దార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఈ విషయాలపై సమగ్రంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేసినట్లు ఆయన తెలిపారు.

ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక



కైకలూరు: కృష్ణా జిల్లా ఫుట్‌బాల్ జట్టుకు కైకలూరు మండలం వరహాపట్నంకు చెందిన విద్యార్థి ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన పళ్ళెం కార్తికేయ గన్నవరం సెయింట్‌జోన్స్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఆదివారం గన్నవరంలో జరిగిన అండర్–15 విభాగానికి జరిగిన పోటీల్లో ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కైకలూరు నియోజకవర్గ స్పోర్ట్స్ కన్వీనర్ పి.లూయిస్‌లు హర్షం వ్యక్తం చేశారు.

ఓటర్ల సర్వే త్వరగా పూర్తి చేయాలి

పామర్రు: ఓటర్ల ఇంటింటి సర్వే త్వరిత గతిన పూర్తిచేయాలని పామర్రు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి బీఎల్‌వోలు, రెవెన్యూ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 21న ప్రారంభించిన ఇంటింటి సర్వే ఇంకా పూర్తి చేయాల్సి ఉన్నదని, మిగిలిన పనిని త్వరిత గతిన పూర్తిచేయాలని ఆదేశించారు. యాప్‌లో కొన్ని సాంకేతిక సమస్యలు ఉన్నట్లు గుర్తించినప్పటికీ సర్వేచివరి దశకు చేరువలో ఉందని అన్నారు. సరిగ్గా పని చేయని బీఎల్‌వోలను సస్పెండ్ చేసేందుకు కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈనెల 28న బీఎల్‌వోలు రిపోర్టులు సమర్పించాలని కోరారు. ఓట్ల తొలగింపులపై ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని, జాబితాలు రూపొందించడంతో పారదర్శకత ఉండాలని అన్నారు. ఫిర్యాదులు రాకుండా పనిచేయాలన్నారు. వలంటీర్ల పాత్ర ఎక్కడా ఉండరాదని ఆదేశించారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎన్నికల డీటీ జగన్ మోహన్‌రావు, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రాము, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

వణుదుర్రు అభివృద్ధికి సహకరిస్తాం

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే



వణుదుర్రు సర్పంచ్ సుగుణబాబును అభినందిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

కైకలూరు: భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ మద్దతుతో విజయం సాధించిన ముదినేపల్లి మండలం వణుదుర్రు సర్పంచ్ చిన్నం సగుణబాబును ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అభినందించారు. పార్టీ నాయకులు, అభిమానులతో కలిసి సర్పంచ్ సుగుణరావు ర్యాలీగా కై కలూరు వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయానికి సోమవారం విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సర్పంచ్‌ను ఘనంగా సన్మానించారు. వణుదుర్రు పంచాయతీ అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని వారు ఈ సందర్భంగా చెప్పారు.

నేడు గంగరాజు శతజయంతి

కైకలూరు: కొల్లేరు ప్రజలు ఆరాధ్యదైవంగా భావించే సైదు గంగరాజు శతజయంతి మహోత్సవాలు మంగళవారంతో ముగుస్తున్నాయని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సోమవారం చెప్పారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు కొల్లేరు కమిటీ ఆధ్వర్యంలో కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో ముగింపు సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కొల్లేరు ప్రాంతంలో విద్యలో ప్రతిభ చూపిన వారికి సన్మానాలు, గంగరాజు జీవితం తెలిపే పుస్తక ఆవిష్కరణ ఉంటుందన్నారు. కొల్లేరు ప్రజలు, గంగరాజు అభిమానులు, తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సీనియర్ సిటిజన్స్‌కు సత్కారం



వృద్ధ దంపతులను సత్కరిస్తున్న వెంకట్రావు తదితరులు

గుడివాడ టౌన్: వృద్ధులను గౌరవించడం మన సంప్రదాయమని మల్లంపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మల్లంపల్లి వెంకట్రావు అన్నారు. ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన వాడవల్లి వెంకట రామకృష్ణ దంపతులను ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకన్నా వయస్సులో పెద్దవారి అనుభవాలను ఆచరిస్తూ సమాజానికి మేలు కలిగేలా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో రమణమూర్తి, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



పెరికెగూడెంలో పీఏసీఎస్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న పీఏసీఎస్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) సోమవారం శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్ (రాము), వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, మండల పార్టీ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర నాయకులు చేబోయిన వీర్రాజు, పాము రవి, సర్పంచ్ పెరుమాళ్ల పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు పెరుమాళ్ల లక్ష్మీకాంతం, ఏఎంసీ సభ్యులు బావిశెట్టి స్వామి, పీఏసీఎస్ అధ్యక్షులు పెరుమాళ్ల రామకృష్ణారెడ్డి, బొమ్మనబోయిన గోకర్ణ, ముంగర మల్లిఖార్జునరావు, గుడివాడ తమ్మిస్వామి, పెరుమాళ్ల వెంకటేశ్వరరెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరులో సీసీ రోడ్డు ప్రారంభం..

మండలంలోని పెరికెగూడెం శివారు కొత్తూరులో రూ.14 లక్షల గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే డీఎన్నార్ సోమవారం ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. డీఎన్నార్ మాట్లాడుతూ గ్రామంలో మిగిలిన రోడ్లను కూడా వేసి, ప్రతి ఇంటికీ తాగునీరు అందించేలా మైక్రోఫిల్టర్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పలువురు ప్రజాప్రతినిధులు, పెరుమాళ్ల హరికృష్ణ, పెరుమాళ్ల సత్యనారాయణ, కొండారెడ్డి, సోములు, పెదవెంకటేశ్వరరెడ్డి, పిండి రాధాకృష్ణ, మల్లేశ్వరరావు ఎంపీడీఓ సీకె వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అంకిత భావంతో సేవ చేస్తే గుర్తింపు



కమిషనర్‌ను సత్కరిస్తున్న తిరుపతయ్య తదితరులు

గుడివాడ టౌన్: అధికారిగా తన బాధ్యతలను అంకిత భావంతో నిర్వర్తించే అధికారి వి.మురళీకృష్ణ అని బొగ్గారపు తిరుపతయ్య చారిటబుల్ ట్రస్ట్ అధినేత తిరుపతయ్య అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్‌కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణను ట్రస్ట్ సభ్యులు సత్కరించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ గతంలో తహసీల్దార్‌గా సేవలందించిన మురళీకృష్ణ ఉద్యోగోన్నతిపై గుడివాడ మున్సిపల్ కమిషనర్‌గా వచ్చి అతి తక్కువ కాలంలోనే ఉత్తమ సేవా పురస్కారం పొందడం ఆయన అంకిత భావానికి నిదర్శనమని అన్నారు. ఆర్యవైశ్య ప్రముఖులు సబ్బాని, వెంకటేశ్వరరావు, గాదె మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈఈ రాఘవరావు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు శివారు అంబేడ్కర్ నగర్‌లో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చొరవతో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.10 లక్షలు ఎంపీ నిధుల నుంచి మంజూరు చేశారు. దీంతో సుమారు 165 మీటర్ల పొడవున సిమెంటు రోడ్డు నిర్మాణం జరగనుంది. రోడ్డు నిర్మాణంతో స్థానికులకు కొంతవరకు ఇబ్బందులు తొలగనున్నాయి. పనులను పీఆర్ ఏఈఈ రాఘవరావు పర్యవేక్షిస్తున్నారు. సిమెంటు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన ఎంపీ బాలశౌరికి, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌కు సర్పంచ్ పెనుమత్స రాధిక, మాజీ వైస్ ఎంపీపీ పీఎస్ కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి



ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ప్రజాప్రతినిధులకు అర్జీ అందిస్తున్న యూనియన్ నాయకులు

పామర్రు: భవననిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని కోరుతూ సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ స్థానిక సీఐటీయూ కార్యాలయం నుంచి బయలు దేరి నాలుగు రోడ్ల కూడలి మీదుగా పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలని అన్నారు. పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు, కార్డులు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఎమ్మెల్యే అందుబాటులో లేని కారణంగా అక్కడే ఉన్న పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావుల ద్వారా వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్లపల్లి వేణుగోపాలరావు, కృష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ట్రజరర్ వేము పెదబాబు, మండల యూనియన్ నాయకులు చొప్పకట్ల రమేష్, షంషాద్ ఆలీ, రాజ శేఖర్, ఖాన్, మన్నె శ్రీను, అరజ శ్రీహరి, కె. నాగభూషణం, ఇంటి రాజు, కాలిచర్ల రఘు తదితరులు పాల్గొన్నారు.

కలిదిండిలో శాంతి ర్యాలీ



శాంతి ర్యాలీలో మానవత సభ్యులు

కైకలూరు: మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో కలిదిండిలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న జెండా ఊపి ప్రారంభించారు. మానవత్వం, శాంతి గురించి కలిదిండి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు నినాదాలు చేశారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ వారోత్సవాలలో భాగంగా శాంతి ర్యాలీ నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు బొర్రా సత్యవతి, కట్టా నాగలక్ష్మీ, నీలి సుమన్, సానా రామారావు, కలిదిండి మానవతా సేవా సంస్థ చైర్మన్ పేటేటి వివేకానంద, అధ్యక్షులు గోదావరి సత్యనారాయణ, చక్కా జగన్, చెన్నంశెట్టి కృష్ణ, చిట్టూరి బాలకృష్ణ పాల్గొన్నారు.